


లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు : ఆర్‌డిఒ

భీమవరం టౌన్ : స్కానింగ్ సెంటర్లలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో లింగ నిర్ధారణపై ఆర్‌డిఒ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరంలో 72 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, అయితే ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రతి మూడు నెలలకు విధిగా తనిఖీలు చేపట్టాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానిత స్కానింగ్ సెంటర్లలో డెకాయ్ ఆపరేషన్లు చేపట్టాలని, దీనికి పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. కాళ్ల మండలంలో వెయ్యి మంది పురుషులకు గాను 804 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారని, ఆ మండలంలో అవగాహన కార్యక్రమం చేపట్టి స్త్రీల నిష్పత్తిని పెంచాలని సూచించారు. కొత్తగా 2 స్కానింగ్ సెంటర్లు మార్పులకు అప్లికేషన్ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ ధనలక్ష్మి, మాజీ ఎజిపి సత్యదేవి, సిఐ నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద సహకార ఉద్యోగుల ధర్నా

సమస్యలపై శాసనమండలిలో గళం విప్పుతా : ఎంఎల్‌సి గోపీమూర్తి




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సహకార ఉద్యోగులు పాల్గొన్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సహకార సంఘం ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సహకార సంఘం ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. కంప్యూటరీకరణ, డబల్ ఆడిటింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా సమస్యల పరిష్కారానికి నోచుకోవట్లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సహకార ఉద్యోగుల ఆందోళనకు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి సంఘీభావం ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ప్రజలు ఓట్లు వేసి నేతలను గెలిపిస్తున్నా ప్రభుత్వ విధానాలు మాత్రం మారడం లేదన్నారు. దీన్ని బట్టి చూస్తే విధానాల పరంగా పాలకులంతా ఒకటేనని స్పష్టమవుతోందన్నారు. విధానాలు మార్చుకొని పాలకులను మార్చుకోవడం మన చేతిలోనే ఉందన్నారు. జిఒ 36ను గత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దాని అమలును తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా సహకార ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వారి సమస్యలపై శాసనమండలిలో మాట్లాడతానని భరోసా కల్పించారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ సహకార ఉద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. సహకార సంఘాలను ప్రజలకు రైతులకు సంబంధం లేకుండా పాలకులు ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారని విమర్శించారు. సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా సహకార సంఘాలను తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు విజయభాస్కర్ మాట్లాడుతూ సహకార ఉద్యోగుల సమస్యలపై దశల వారీ ఆందోళనకు శ్రీకారం చుట్టామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 27న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు, సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, సహకార ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణశాస్త్రి, పెద్దిరాజు, నరసింహరాజు, సోనీ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

కేంద్ర సహాయ మంత్రి కార్యాలయ సిబ్బందికి నేతల వినతి



కేంద్ర సహాయ మంత్రి కార్యాలయ సిబ్బందికి మెమోరాండం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఢిల్లీలో 56 రోజులుగా రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను విరమింపజేసి తక్షణం సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘాల నాయకులు కోరారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ద్వారా ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం శ్రీనివాస్ వర్మ కార్యాలయ సిబ్బందికి రైతు సంఘం నాయకులు చింతకాయల బాబూరావు, లంకా కృష్ణమూర్తి, ఆనంద్, శ్రీనివాసరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మెమోరాండం అందజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పి పట్టించుకోలేదన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని రాతపూర్వకంగా రైతు సంఘాల ఉద్యమానికి ఇచ్చిన అంగీకార పత్రం ఇప్పటికీ అమలు జరుపలేదన్నారు. నాలుగేళ్లకు పైగా కావస్తున్నా నేటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అంగీకార పత్రాన్ని తక్షణం అమలు చేయాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ 58 రోజులుగా రైతు నాయకులు జగ్జీత్ దల్లేవాల్ జరుపుతున్న ఆమరణ నిరాహార దీక్ష ఆయన ప్రాణానికి ముప్పుగా పరిణమించిందన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని కోరారు.

డాక్టర్ల కొరత.. అమ్మకు వ్యథ..!



- ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రసూతి, పిల్లల విభాగంలో వేధిస్తున్న డాక్టర్ల కొరత
- 16 మంది ఉండాల్సిన చోట ఆరుగురు వైద్యులు
- ప్రతిరోజూ 150 వరకూ గర్భిణుల ఓపి,15కు పైగా ప్రసవాలు
- డాక్టర్ల కొరతతో గర్భిణులు ఎక్కువసేపు వేచిచూడాల్సిన పరిస్థితి
- పనిచేసే డాక్టర్లపై తీవ్ర ఒత్తిడి
- మెడికల్ కాలేజీలోని డాక్టర్లను సర్దుబాటు చేసే అవకాశం ఉన్నా పట్టించుకోరా?



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఎంసిహెచ్ బ్లాక్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి, పిల్లల (ఎంసిహెచ్) బ్లాక్‌లో వైద్యుల కొరత కొత్త జన్మకు ప్రాణం పోసే అమ్మలకు తీవ్ర వ్యథను కలిగిస్తోంది. ఆసుపత్రికి వస్తున్న గర్భిణులకు అక్కడ సేవలందించే వైద్యుల సంఖ్యకు ఏమాత్రమూ సంబంధం లేకుండా పోయింది. దీంతో అక్కడి పనిచేసే వైద్యులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి, పిల్లల ఆసుపత్రికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు నుంచి ఇక్కడకు వచ్చే గర్భిణులకు మంచి సేవలందించడంలో పేరొందింది. జిల్లాలోని నలుమూలల నుంచి ఇక్కడకు గర్భిణులు పెద్దఎత్తున వైద్యసేవల కోసం వస్తుంటారు. ప్రతిరోజు వైద్యులకు చూపించుకునే గర్భిణుల సంఖ్య సరాసరి 150 వరకూ ఉంటుంది. ప్రతిరోజూ 15 పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో కొన్ని ఆపరేషన్ కేసులు, మరికొన్ని నార్మల్ డెలివరీలు ఉంటాయి. ఇంతమంది గర్భిణులకు, ప్రసవించిన తల్లులకు నాణ్యమైన సేవలు అందాలంటే సరిపడా డాక్టర్లు ఉండాలి. సర్వజన ఆసుపత్రిలోని ఎంసిహెచ్ బ్లాక్‌లో అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. 16 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఆరుగురు మాత్రమే సేవలందిస్తున్నారు. డాక్టర్ల కొరతతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. వైద్యుల కొరత కారణంగా ఆసుపత్రికి వచ్చే గర్భిణులు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. గర్భిణులు అంతసేపు ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయివేటు ఆసుపత్రికి వెళితే ప్రసవాలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నారు. సామాన్య కుటుంబాలకు చెందిన వారు ఆర్థిక స్తోమత లేక ఏలూరు సర్వజన ఆసుపత్రికి వస్తున్నారు. పేదలకు వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్న పరిస్థితి నెలకొంది. కొత్త శిశువుకు జన్మనిచ్చే తల్లులకు సైతం సరైన వైద్యం అందించలేని పరిస్థితి ఉండడం దారుణంగా చెప్పొచ్చు. జిల్లా ఆసుపత్రి నుంచి బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత సౌకర్యాలు, పెద్ద ఎత్తున డాక్టర్లు వస్తారని జిల్లా ప్రజానీకం ఆశించారు. పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఉన్న కొద్ది మంది డాక్టర్లు అహర్నిశలూ శ్రమించి సేవలందిస్తున్నా విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ పనిచేసే వైద్యులు మానసిక ఒత్తిడికి గురవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వెంటనే ప్రసూతి, పిల్లల ఆసుపత్రికి సంబంధించి వైద్యుల కొరత లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆసుపత్రి సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గర్భిణులకు సంబంధించి ఇబ్బందులను వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపైనా ఉంది.

డాక్టర్ల సర్దుబాటులో నిర్లక్ష్యమా..

ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి, పిల్లల బ్లాక్‌లో డాక్టర్ల కొరత ఉందని అధికారుల నుంచి అందరికీ తెలిసిందే. గర్భిణులకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం జరిగినా తల్లీ బిడ్డకు సైతం ప్రమాదం ఏర్పడుతోంది. ఏలూరు మెడికల్ కాలేజీలో సరిపడా వైద్యులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అక్కడి వైద్యులను ఇక్కడ సర్దుబాటు చేసి ఎందుకు సేవలు అందించలేకపోతున్నారో అర్థంకావడం లేదు. అంతేకాకుండా వేరే ఆసుపత్రిలో ఉన్న వైద్యులను అవసరం నిమిత్తం కేటాయించి సేవలందించే అవకాశాన్ని పరిశీలించని పరిస్థితి నెలకొంది. రోగులకు వైద్యసేవలు అందించేందుకు సరైన ప్రణాళిక లేకపోవడమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు డాక్టర్ల కొరతపై దృష్టి సారిస్తే ఎంతోమంది తల్లులకు మేలు జరుగుతోంది.

ఇలా ఉంటే పిల్లలు కనడం ఎలా..?

ఇటీవల ముఖ్యమంత్రి సంతానం పెంపుపై ఎక్కువగా మాట్లాడుతున్నారు. యువత సంఖ్య తగ్గిపోతోందని, ఇద్దరికిపైగా పిల్లలు కనాలంటూ చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకూ ప్రయివేటు ఆసుపత్రిలో చూపించుకుంటే రూ.రెండు లక్షల వరకూ ఖర్చవుతోంది. ప్రభుత్వాసుపత్రికి వెళ్దామంటే అక్కడ డాక్టర్ల కొరత, సౌకర్యాలలేమి వెంటాడుతోంది. ప్రభుత్వ వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందించకుండా.. పిల్లల కనండంటూ మాట్లాడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టార్గెట్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

జిల్లా కలెక్టర్‌కు కౌలు రైతుల సంఘం వినతి

ప్రజాశక్తి - భీమవరం

టార్గెట్‌తో సంబంధం లేకుండా తక్షణం కల్లాల్లోని ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి కౌలు రైతుల సంఘం నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు మాట్లాడారు. జిల్లాలో పంట మాసూళ్లు మొదలై రెండు నెలలు గడుస్తోందన్నారు. జిల్లాలో సాగునీటి ఇబ్బందులతో పంటలు వేసే సమయంలో వ్యత్యాసం రావడంతో జిల్లా అంతా ఒకేసారి కోతలు వచ్చే పరిస్థితి లేదన్నారు. దీంతో జిల్లాలో ఇప్పటికీ పోడూరు, పాలకొల్లు, ఆచంట, భీమవరం, వీరవాసరం, అత్తిలి, యలమంచిలి వంటి మండలాల్లో ధాన్యం కల్లాల్లోనే ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందని, అయితే 15 రోజులుగా టార్గెట్ అయిపోయిందని ధాన్యం కొనుగోలు చేయడం లేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో పంటలు పండిస్తున్న కౌలురైతులు పండుగ సమయంలో ఆర్థిక ఇబ్బందులు పడడంతోపాటు మరోపక్క దాళ్వా నాట్లు పెట్టబడికి డబ్బుల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణం ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలన్నారు. స్పందించిన జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ టి.శివరాంప్రసాద్ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు యథావిధిగా జరుగుతాయన్నారు. వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా వేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు



పెనుమదంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పులో ఉన్నా కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యతిస్తోందని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పోడూరు మండలం 4 గ్రామాల్లో రూ.10 కోట్లతో సిమెంట్ రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన పెనుమదంలో మీడియాతో మాట్లాడారు. గత జగన్ పాలనలో విధ్వంసానికి గురైన ఎపికి మళ్లీ మోడీ అండతో చంద్రబాబు, పవన్ పూర్వ వైభవం తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో లూలు, జాకీ, అమర్ రాజా, కియో వంటి పరిశ్రమలు ఎన్నో ఈ రాష్ట్రాన్ని వదిలి పొరుగు రాష్ట్రాలకు పోయాయని చెప్పారు. నాడు జగన్ వేల కోట్ల ప్రజాధనంతో విలాస వంతమైన భవంతులు నిర్మించుకుంటే నేడు చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడం ద్వారా పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలను రప్పించేందేకు కృషి చేస్తున్నారని తెలిపారు. మోడీ విశాఖ పర్యటన రోజునే రెండు లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చి చంద్రబాబు పునర్నిర్మానం చేస్తున్నారన్నారు. పోలవరం, విశాఖ ఉక్కు, రైల్వేజోన్, మెట్రో రాష్ట్రంలో పట్టాలెక్కుతున్నాయన్నారు. 5 సంవత్సరాల పాలనలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా యువతకు రాష్ట్రంలో పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు.

సమస్యలపై సత్వర పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్‌లో అందిన సమస్యలపై సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 194 అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల నుంచి స్వీకరించిన పిటీషన్లను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో సమర్పించే అర్జీలకు సత్వరమే పరిష్కార దిశగా పనిచేయటం అత్యంత ప్రాధాన్యమన్నారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు విచారణ చేపట్టి నిర్దేశించిన సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి రీఓపెనింగ్ లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన వారిలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసి రెడ్డి, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు ఉన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు నిర్వహించాలి

జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు సి.నాగరాణి సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా లక్ష రూపాయల కంటే ఎక్కువగా సభ్యత్వ రుసుమును సేకరించిన తణుకు తహశీల్దార్, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ అభినందించారు.

మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి

ఈనెల 25న పాలకొల్లులో ఏర్పాటు చేస్తున్న ఉద్యోగ దిక్సూచి కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో 25న పాలకొల్లు బిఆర్ఆర్ అండ్ జికెఆర్ చాంబర్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉద్యోగ దిక్సూచి(మెగా జాబ్ మేళా) పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణ రెడ్డి ఉన్నారు.

కులగణనలో అభ్యంతరాలు, సవరణల తేదీ పొడిగించాలి

కలెక్టర్‌కు కెవిపిఎస్ జిల్లా బృందం వినతి

అభ్యంతరాలకు అవకాశం కల్పిస్తాం : కలెక్టర్ నాగరాణి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌సి, ఎస్‌టిల కులగణనలో అభ్యంతరాలు, సవరణలకు తేదీని పొడిగించాలని కోరుతూ సోమవారం కెవిపిఎస్ జిల్లా బృందం జిల్లా కలెక్టర్ నాగరాణికి వినతి పత్రం అందజేశారు. ప్రతినిధి బృందం నాయకులు మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబులతో కలెక్టర్ చర్చలు జరిపారు. ఇప్పటికే చాలాసార్లు పత్రికల ద్వారా ప్రచారం చేశామని కలెక్టర్ తెలుపగా జిల్లా వ్యాప్తంగా దళిత ప్రజలకు ఎటువంటి సమాచారం లేదని, సర్వేలో ఎన్నో లోటుపాట్లు ఉన్నాయని, తక్షణం తేదీని పొడిగించాలని కోరారు. అందుకు 5 రోజుల్లో సవరణలు ఏమైనా ఉంటే రెవెన్యూ అధికారులకు అందించండని ప్రతినిధి బృందానికి కలెక్టర్ తెలిపారు. ఇంకా అభ్యంతరాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తీసుకోమని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్‌సి, ఎస్‌టి కులగణన వివరాలను జిల్లాలోని అన్ని సచివాలయాలలో ప్రదర్శించాలని ఆదేశాలను జిల్లాలో ఎక్కువ సచివాలయాలు అమలు చేయడం విఫలమయ్యాయని తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 26వ తేదీన ప్రదర్శన పెట్టాల్సిన వివరాలు 30వ తేదీ వరకు పెట్టలేదని తెలిపారు. ప్రదర్శన పెట్టినచోట్ల ఎస్‌సి, ఎస్‌టిలకు ఎవరికీ సమాచారం లేదన్నారు. అధికారులు కూడా కనీస అవగాహన కల్పించడం, ప్రచారం చేయడం కానీ ప్రయత్నం చేయలేదని అన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే సరైన అవగాహన అధికారులకే లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కులగణన చేపట్టడానికి ముందు అప్పటి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్వేకు చట్టబద్ధత కల్పించాలని, ఎస్‌టిల్లో ఉన్న యానాదులు, ఎరుకలు, చెంచులు వంటి వారికి ఆధార్ కార్డులు కూడా లేవు కాబట్టి మాన్యువల్‌గా సర్వే చేసి, లెక్కించాలని, అనుభవజ్ఞులైన మండల స్థాయి అధికారులతో సర్వే చేయించాలని, సర్వే చేస్తున్న సమయంలో అన్ని దళిత ప్రజా సంఘాలను కలుపుకొని వెళ్లాలని కెవిపిఎస్ కొన్ని సూచనలు చేసిందని గుర్తు చేశారు. కానీ వాటిని గమనంలో పెట్టుకోలేదని, కేవలం ప్రభుత్వ కార్యాలయంలోనే కూర్చొని వలంటీర్ ఆధారంగా సర్వే చేశారే తప్ప ఇంటింటి సర్వే చేయలేదని ఆరోపించారు. ఎవరికీ తెలియకుండా సర్వే చేసి ఇప్పుడు కూడా ఎవరికీ తెలియకుండా లిస్ట్‌లోని గ్రామ సచివాలయంలో పెట్టి అదే కులగణన సర్వే అనడం సబబు కాదన్నారు. దీనివల్ల భవిష్యత్తులో అనేక ఇబ్బందులు వస్తాయని తెలిపారు. వలంటీర్ ఇచ్చిన సమాచారంతోనే చేసిన సర్వేను రద్దుచేసి, ఇంటింటికీ రీ సర్వే చేయాలని వారు కోరారు. తక్షణం జిల్లాలో కులగణనలో అభ్యంతరాలకు, సవరణలకు సమయాన్ని పొడిగించాలని, అన్ని దళిత పేటలో అవగాహనకై ప్రచారం చేయించాలని వారిని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు చిన్నం చిన్న నాగేశ్వరరావు, మాదాసి గోపి, కప్పల రత్నం రాజు, జిల్లా కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండలు, నాయకులు పెంటారావు ఉన్నారు.

నేరాల అదుపునకు చర్యలు

మోడల్ పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభోత్సవంలో ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ



నూతన మోడల్ పోలీస్ భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో రూ.1.40 కోట్లతో నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని సోమవారం సాయంత్రం జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో నేరాల అదుపునకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎంఎల్‌ఎ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఆలస్యమైనా ఆచంటలో అధునాతనమైన మోడల్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించామని అన్నారు. అభివృద్ధిలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం ఒక ముఖ్య భాగమని తెలిపారు. త్వరలో పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌కు కూడా అధునాతన భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, తణుకు ఎంఎల్‌ఎ ఆరుమిల్లి రాధాకృష్ణ, ఎంఎల్‌సి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు, ఎంఎల్‌సిలు కౌరు శ్రీనివాసు, వంక రవీంద్రనాథ్, ఇల్లా వెంకటేశ్వరరావు, బొర్రా గోపీమూర్తి, అడిషనల్ ఎస్‌పిలు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పై విచారణ జరపండి

ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

గత కొన్ని రోజుల నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై వస్తున్న అనేక ఆరోపణలపై ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి స్పందించారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సోమవారం కలిసి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పై వస్తున్న ఆరోపణలపై ఫిర్యాదు చేశారు. భీమవరం సమీపాన గొల్లలకోడేరులో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అనే పేరును దుర్వినియోగం చేస్తూ, విద్యార్థులను, తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తుందని తెలిపారు. ఇది నిజానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ స్థాయికి చెందినది కాదని చెప్పారు. ఇది కేవలం ఢిల్లీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మాత్రమేనని స్పష్టం చేశారు. పేరును వాడుకుంటూ ప్రామాణికతను అబద్ధంగా ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జెసిని అభ్యర్థించారు. తప్పుదోవ పట్టించే విధంగా స్కూల్ నిర్వహణ కొనసాగుతున్నట్లు ఆరోపణల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పశుపోషణ పెంపునకు పశువైద్య శిబిరాలు దోహదం

రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్, ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పల్లెల్లో సైతం పశుపోషణ నానాటికి తగ్గుతున్న పరిస్థితుల్లో పశు పెంపకం చేపట్టేవారిని ప్రోత్సహించేందుకు పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన ఆవశ్యకత ఏర్పడిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ఉచిత పశువైద్య శిబిరాల పోస్టర్లను ఎంఎల్ఎ అంజిబాబు ఆవిష్కరించారు. ఈనెల 31వ తేదీ వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాల అవగాహనా సదస్సులు నిర్వహిస్తారని, నట్టల నివారణ మందులు పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు, పశువిజ్ఞానంపై అవగాహనా సదస్సులు జరుగుతాయని తెలిపారు. పశు పోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏరియా సహాయ సంచాలకులు డాక్టర్ సుధీర్ బాబు, గుట్టపాడు పశు వైద్య అధికారి డాక్టర్ పుండరి బాబు, వెంప పశువైద్యులు డాక్టర్ మార్క సత్యేంద్ర, జిల్లా పి.ఆర్ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్ల : పాడి రైతులందరూ ఈ ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని పశు సంపద అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డాక్టర్ జివిఎస్.చంద్రబాబు కోరారు. కోపల్లె గ్రామంలో పశువైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కోపల్లె గ్రామ సర్పంచి బూది నాగమణి, ఉప సర్పంచి బూది వెంకట వర్రాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ జివిఎస్.చంద్రబాబు, పారా సార్, వీర వెంకన్న, గోర్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని మొగల్తూరు, ఎపి పాలెం నార్త్ గ్రామాలలో పశు వైద్య శిబిరాలు సోమవారం నిర్వహించామని పశువైద్యాధికారి నీలమ తెలిపారు. 46 పశువులకు చికిత్స అందించామన్నారు, 11 పశువులకు గర్భకోశ వ్యాధులు, తొమ్మిది పశువులకు చుడి పరీక్షలు, 73 నటల నివారణ టీకాలు, 1126 గొర్రెలు, మేకలకు నటల నివారణ టీకాలు వేసామని వైద్యులు తెలిపారు.

పేద కుటుంబానికి జనతా ట్రస్ట్ ఆర్థిక సాయం

ఆచంట : కుటుంబ పోషణ నిమిత్తం రోడ్డు పనికి వెళ్తే ఆ పక్కింటి ఆ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్న కుటుంబ పెద్ద కాలు తీసివేయవలసిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకెళ్తే ఆచంట పెదపేట గ్రామానికి చెందిన మాకా రామకృష్ణ ఇటీవల రోడ్డు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కుడికాలు ఎముక ఫ్రాక్చర్ కావడంతో కొంతకాలానికి కాలు ఇన్ఫెక్షన్ అయ్యి కాలు తీసేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ తరహాలో వైద్యులు సూచన మేరకు కాలు మోకాలు వరకు తొలగించారు. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు కలరు. ఆ కుటుంబానికి జనతా ట్రస్ట్ సభ్యులు పరామర్శించి కుటుంబ అవసరాల నిమిత్తం నెలకు సరిపడా బియ్యం, పప్పులు, ఆయిల్, తదితర నిత్యావసర సరుకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, సీనియర్ అడ్వకేట్, టిడిపి నాయకులు బీర నరసింహమూర్తి, లోకల్ టిడిపి నాయకులు దబ్బా ప్రకాష్ సహకరించారు. వైస్ ప్రెసిడెంట్ జయప్రకాష్, సెక్రటరీ పి.బాబూరావు పాల్గొన్నారు.

నేడు ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

పెనుమంట్ర : ఈనెల 21వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు ఆచంట నియోజకవర్గంలోని పెనుమంట్ర, పోడూరు మండలాల అన్ని పంచాయతీల క్షేత్ర సహాయకుల(ఫీల్డ్ అసిస్టెంట్)కు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ. బివిఎస్.ఎస్.శర్మ సోమవారం ఇక్కడ తెలిపారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్ లో జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో అందరూపాల్గొనాలని కోరారు.

భవిత కేంద్రంలో ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం : భవిత వికలాంగుల శిక్షణా కేంద్రంలో సోమవారం సహిత క్లబ్ ఆధ్వర్యంలో వికలాంగుల పిల్లలకు, నార్మల్ పిల్లలకు కలిపి డాన్సు, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్ఎ.బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ సహిత క్లబ్ కార్యక్రమాలు వికలాంగుల పిల్లలకు ఉత్తేజాన్ని నింపుతున్నాయని, సమగ్ర శిక్ష వారు వికలాంగుల పిల్లల తల్లిదండ్రులకు మానసిక ధైర్యాన్ని కల్పిస్తూ అందిస్తున్న ఉచిత సదుపాయాలను అందరికి అందేలా కృషి చేయడానికే సహిత క్లబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ క్లబ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నార్మల్ పిల్లల తల్లిదండ్రులు, వికలాంగుల పిల్లల తల్లిదండ్రుల సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని కె.కుమారి, అంగన్వాడీ టీచర్ సత్యవతి, నాగలక్ష్మి, రత్నకుమారి, వికలాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మాంటిస్సోరీ క్రీడోత్సవాలు

తణుకు : ప్రతీ ఒక్కరూ క్రీడల్లో పాల్గొని గెలుపు, ఓటములను సమదృష్టితో స్వీకరించాలని మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. తణుకు పట్టణంలో స్థానిక మాంటిస్సోరి స్కూల్లో సోమవారం 36వ వార్షిక క్రీడోత్సవాలు ఎంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు జాతీయ పతాకావిష్కరణ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఓటమి రేపటి విజయానికి తొలిమెట్టు అని, క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక, దేహ దారుఢ్యం, మానసిక ఉల్లాసం, చక్కని ఆరోగ్యం కలుగుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.లక్ష్మీ వ్యాయామ ఉపాధ్యాయులు పి.శివ పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు అందించాలని వినతి

ఆచంట : కేరళ, తమిళనాడుల రైతులకు రూ.500 బోనస్, సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు, రైతుభరోసా ఇవ్వాలని సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు పిల్లి ప్రసాద్, ముడే మోజెస్, బి.వెంకటరావు, సిహెచ్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో వాహనాన్ని నడపాలి

ఉండి: వాహన ప్రయాణ సమయంలో డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాన్ని నడపాలని వాహన తనిఖీ అధికారులు కెఎస్ఎన్.ప్రసాద్, సిహెచ్.వెంకటరమణ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా సోమవారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఆటో, బస్సు, వ్యాన్ డ్రైవర్లకు ప్రజలకు ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనం నడిపే సమయంలో ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలని, ఏకాగ్రతతో వాహనాన్ని నడపాలని సూచించారు. ఈ సదస్సులో భీమవరం ట్రాఫిక్ సిఐ వి.నారాయణమూర్తి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం : సర్పంచి

ఉండి: గ్రామ అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా తమ పాలన సాగిస్తున్నామని పెదపుల్లేరు గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఉండి మండలం పెదపుల్లేరు గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచి పార్వతి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. వచ్చే సంవత్సరానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి శివాజీ, బోర్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కాళ్ల పోలీస్ స్టేషన్ ప్రాంత పరిశీలన

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో కాళ్ల పోలీస్ స్టేషన్ నిర్వహించనున్న ప్రాంతాన్ని భీమవరం డిఎస్పి జయసూర్య సోమవారం పరిశీలించారు. కాళ్ల గ్రామంలో ఉన్న పోలీస్ స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరింది. ఆ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో వర్షం నీరు లీక్ అవుతుంది. స్టోర్ రూం ఎప్పుడైనా కూలిపోయే విధంగా ఉందని కాళ్ల ఎస్ఐ పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు కాళ్లకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని తాత్కాలికంగా కాళ్ల పోలీస్ స్టేషన్కు ఇవ్వాలని కాళ్లకూరు గ్రామ పంచాయతీ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో ఆకివీడు సర్కిల్ సిఐ జగదీశ్వరరావు, తహశీల్దార్ జి.సుందర్ సింగ్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం నవాబుపాలెం రైల్వే స్టేషన్ మధ్య సోమవారం ఉదయం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జిఆర్పి ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు. జిఆర్పి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం నవాబుపాలెం రైల్వే స్టేషన్ మధ్య గుర్తుతెలియని సుమారు 45 సంవత్సరాల వయసు గల మగవ్యక్తి గుర్తుతెలియని రైలు బండి ఢీకొట్టడంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలియాల్సివుందని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం రూంలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడు బూడిద కలర్ బనియన్, బ్లూ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన యెడల 9490617090, 9948010061 నంబర్లకు తెలపాలన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే రీసర్వే

నవాబుపాలెం రీసర్వే సభలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న భూముల స్థల వివాదాల పరిష్కారానికి ఈ రీసర్వే పరిష్కారం చూపుతోందని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లాలోనే ప్రప్రథమంగా తాడేపల్లిగూడెం నవాబ్ పాలెం గ్రామంలో తలపెట్టిన రీ సర్వే ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి ఇన్ఛార్జ్ వలవల బాబ్జి, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రీ సర్వే వల్ల ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, భూ తగాదాల శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామన్నారు. నవాబుపాలెంలో ఉన్న 690 ఎకరాల భూ సర్వేను నాలుగు నెలల పాటు సర్వే బృందాలు సర్వే చేపడుతుందని వివరించారు. ఆ సర్వేలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే మరొక మొబైల్ బృందం దాని శాశ్వత పరిష్కారానికి చొరవ చూపిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకే ముందుకు వస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం తోలిన 48 గంటల్లోపే ధాన్యం సొమ్ము రైతుల ఖాతాలకు జమ చేసి రైతులకు రాబోయే పంటకు పెట్టుబడి పెట్టుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో విచ్ఛిన్న చేసిన రోడ్లను మరమ్మతులు చేసే పనులు చేపడుతున్నామని, కాస్త ఆలస్యమైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ కూడా అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకుని ఇబ్బంది పడ్డ బాలుడికి టిడిపి సీనియర్ నాయకులు మద్దుకూరి ధనరాజు ఆధ్వర్యంలో గ్రామంలో దాతలు రూ.నలభై వేలు అందించగా, వాటితోపాటు ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సొంతంగా మరో 10 వేలు జత చేసి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. వాటితోపాటు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందించే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికంగా ఆదుకుంటామని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మద్దుకూరి గంగా భవాని, ఎంపిటిసి బండి వెంకటలక్ష్మి, జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్, అడబాల నారాయణమూర్తి, పాలురి వెంకటేశ్వరరావు, మద్దాల మణికుమార్, దళిత నాయకులు చాపల రమేష్, బిజెపి నాయకులు నరిసి సోమేశ్వరరావు, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.



రీసర్వే ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

బెల్ట్ షాపులను అరికట్టాలి

కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కల్లుగీత కార్మికుల పరిస్థితి నానాటికీ దిగజారి పోతుందని, అంతేకాక పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉందని గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ దాట్ల మెమోరియల్ ట్రస్ట్లో మండల గీత సొసైటీ ప్రెసిడెంట్ల సమావేశం కడలి బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహమూర్తి మాట్లాడుతూ మండలంలో సుమారు 500 వరకు బెల్ట్ షాపుల ద్వారా గుడి, బడి, చర్చి అనే తేడా లేకుండా ఎటిఎంల వలే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ, అన్ని వేళల్లో మద్యం బెల్ట్ షాపుల ద్వారా ఏరులై పారుతుంటే ఎక్సైజ్ వారికి కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. మద్యం సిండికేట్లకు అమ్ముడుపోయిన ఎక్సైజ్ వారు ఆరోగ్యానికి ప్రమాదకరమైన బీరు, బ్రాందీ, విస్కీలను అక్రమంగా అందిస్తూ ఆరోగ్యానికి అన్ని రకాలుగా ఉపయోగపడే తాటికల్లు అమ్మకాలు లేకుండా గీత కార్మికుల ఉపాధి దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో గీత కార్మిక సొసైటీ అధ్యక్షులు కంకటాల నాగేశ్వరరావు, నాయకులు గుబ్బల పాటేశ్వరరావు, బొక్కా కృష్ణ, మండలంలోని పలు గ్రామాలకు చెందిన గీత కార్మికులు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం : కల్లు అమ్మకాలను దెబ్బ తీస్తున్న బెల్ట్ షాపులు అరికట్టి కల్లగీత కుటుంబాలను ఆదుకోవాలని కల్లుగీత సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొక్క చంటి డిమాండ్ చేసారు. సోమవారం స్థానిక మీరా గ్రంథాలయంలో నరసాపురం ఎక్సైజ్ సర్కిల్లోని గీత కార్మికుల సమావేశం శీలబోయిన మహేశ్వర రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బొక్క చంటి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ గీత కార్మికుల తలరాతలు మార్చే పాలకులు రారా అని అన్నారు. ఎక్సైజ్ వారు సిండికేట్తో చేతులు కలిపినందువల్లే రాత్రి, పగలు తేడా లేకుండా గుడి, బడి, చర్చి అని చూడకుండా బెల్టు షాపుల ద్వారా మద్యం వరదలా పారిస్తున్నారని, కల్లు అమ్మకాలు లేక ఉన్న ఉపాధి దెబ్బ తిని గీత కార్మికులు గొల్లు మంటున్నారని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడునెలలు అయినా గీత కార్మికుల గురించి మాట్లాడకపోవడం అన్యాయం అన్నారు. తాటి చెట్టుపై నుంచి పడి చనిపోతున్నారు వారికి రూ.10 లక్షల ఎక్స్గ్రేషియో తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బొక్క సోమేశ్వరరావు, బండి పోలేశ్వరరావు, దొంగ వెంకటేశ్వర్లు, ఇర్రంకి వెంకటేశ్వరరావు, గుత్తుల దుర్గారావు, గుబ్బల నాగరాజు, పెచ్చెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జడ్పిటిసి సురేష్బాబు

ఆచంట : పశువులకు వచ్చే ఆరోగ్య సమస్యలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. పశువుల ఆరోగ్య శిబిరాలలో భాగంగా సోమవారం పెనుమంచిలి గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పశుదానాను అందజేశారు. అనంతరం మండల పశువైద్యాధికారి ఎల్.ఫణికుమార్ మాట్లాడుతూ పశువులకు శుభ్రమైన నీరు పెట్టడం, పశువుల పాకలు పొడిగా ఉండేటట్లు చూసుకోవడం ద్వారా తరచుగా వచ్చే వ్యాధులను నివారించుకోవచ్చు అన్నారు. రైతులు పాల దిగుబడిని పెంచుకోవడంలో నట్టల నివారణ మందులను వినియోగించుకోవాలన్నారు. కాలుష్యం ఇంజక్షన్లను ఆరు నెలలకు ఒకసారి చేయిస్తే రోజుకు అదనంగా లీటర్ పాల దిగుబడి పెరుగుతుందన్నారు. పశువులపాకల్లో తరచూ పొడి సున్నం చల్లుకుంటే అంటువ్యాధులను నివారించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు సురేందర్ రెడ్డి, నేతలు మోహన్రావు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ ఆఫీస్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 6 అర్జీలు వచ్చినట్లు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 2, పబ్లిక్ హెల్త్ విభాగంలో 1, టౌన్ ప్లానింగ్ విభాగంలో 3 మొత్తం 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కారం చేయవలసిందిగా ఆయా శాఖల అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

నరసాపురం : మీకోసం కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కారం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 30 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందని నరసాపురం ఆర్డిఒ దాసిరాజు అన్నారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బాలోత్సవాన్ని జయప్రదం చేయాలి

తణుకు: తణుకు బాలోత్సవం, పిల్లల సంబరాలు ఈనెల 24, 25, 26 తేదీల్లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సందర్భంగా ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో తణుకు బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి మాట్లాడుతూ 40 అంశాల్లో జరిగే ప్రతిభా ప్రదర్శన పోటీల్లో 2 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారని తెలియజేశారు. కమిటీ అధ్యక్షులు పిఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను తణుకు పట్టణం, పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, పురప్రముఖులు, స్వచ్ఛంద సేవా సంస్థలు సహకరిస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఎఎస్వి.శేషుబాబు పాల్గొన్నారు.

గొల్లలకోడేరు పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

పాలకోడేరు : గొల్లలకోడేరు పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్పై సర్పంచి కుక్కల లక్ష్మి, ఉప సర్పంచి కలిదిండి శ్రీనివాస్ వర్మ, మిగిలిన పంచాయతీ పాలకవర్గం సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్ గ్రామంలో ఏ అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. పంచాయతీ పాలకవర్గం సభ్యులంతా పనులకు తీర్మానం చేసినప్పటికీ ఆ పనులకు ఏదో ఒక అడ్డు చెపుతూ మమల్ని తప్పు దారి పట్టిస్తున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు విచారించి చర్య తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గం సభ్యులు కోరుతున్నారు.

రేపు ఏలూరులో జాబ్ మేళా

పెనుమంట్ర : జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయము(నేషనల్ కెరీర్ సర్వీసు), ఏలూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఉదయం 9.30 నిమిషాలకు జిల్లా ఉపాధి కార్యాలయం, ఏలూరులో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలోని శ్రీ సిటీలో గల పశ్చిమ ఆసియాలోని అతిపెద్ద కాడ్బెరి చాకొలేట్ తయారీ కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కంపెనీలో టీం మెంబెర్ ట్రెయినీగా పనిచేయుటకు ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ మొదటి ప్రయత్నంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, 18–22 సంవత్సరాల వయసు గల యువతీయువకులు అర్హులన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు సంవత్సరానికి సుమారు రూ.2.34 లక్షల జీతం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, ఉద్యోగాలలో సెలెక్ట్ అయిన వారికి ఉన్నత చదువులకు, స్కిల్ ట్రైనింగ్ కూడా అవకాశం ఇవ్వబడునన్నారు. సబ్సిడీ మీద ఇతర సదుపాయాలు కల్పించబడుతుందని, శ్రీ సిటీ కి సంబంధించిన వివిధ ఇండస్ట్రీ ప్రతినిధులు కూడా పాల్గొంటారన్నారు. అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులు(మూగ, చెవిటి) అయిన వారు పాల్గొనవచ్చున్నారు. యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరములకు నెంబర్ 8886882032ను సంప్రదించవచ్చని ఆయన కోరారు.

నేడు పెట్టుబడి-ప్రజాస్వామ్యం అంశంపై సెమినార్

లెనిన్ శత వర్థంతి నిర్వహణ కమిటీ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

రష్యా విప్లవ రథసారది, సమసమాజ నిర్మాత లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు భీమవరంలోని ప్యాడి రైస్ మర్చంట్స్ హాలులో 'పెట్టుబడి ప్రజాస్వామ్యం' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు లెనిన్ శత వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు జెఎన్వి.గోపాలన్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సెమినార్కు ముఖ్య వక్తగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం హాజరౌతున్నట్లు తెలిపారు. లెనిన్ నాయకత్వంలో రష్యాలో జార్ చక్రవర్తి పాలనలో ఫ్యూడల్ ప్రభువులు రైతు, కూలీ, కార్మికులు-ప్రజలను విపరీతంగా దోచుకోవడం, భారాలు వేయడం, మనుషులను బానిసలుగా చూస్తున్న కాలంలో లెనిన్ నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ 1917లో జార్ చక్రవర్తిని కూలదోసి అధికారం చేపట్టిందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, గృహం, ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుందన్నారు. స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పించిందని పేర్కొన్నారు. అంతవరకు ప్రపంచం చూడని నూతన సమాజాన్ని భూతలంలో స్వర్గాన్ని సృష్టించిందన్నారు. అటువంటి మహత్తర సమాజానికి రూపశిల్పి లెనిన్ అని పేర్కొన్నారు. అంతటి గొప్ప నేత శతవర్ధంతి 2024 జనవరి 21 నుంచి ప్రారంభమై 2025 జనవరి 21 వరకు సాగిందన్నారు. దీనిలో భాగంగా జరిగే ఈ సెమినార్కు మేధావులు, విద్యావంతలు, ప్రజాస్వామికవాదులు ప్రజలందర్నీ ఆహ్వానిస్తున్నట్లు గోపాలన్ తెలిపారు.

ప్లాస్టిక్ నిరోధానికి తొలి అడుగు

దశలవారీగా నిర్మూలన : కలెక్టర్



భీమవరం : జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు తాను కలెక్టరేట్ నుండే ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగరాణి జిల్లాలో మొట్టమొదటిగా జిల్లా కలెక్టరేట్లో ప్లాస్టిక్ నిషేధిత థీమ్ను ప్రారంభించి, సమావేశానికి విచ్చేసిన అధికారులకు స్టీల్ పాత్రల నందు మాత్రమే తాగునీటిని, స్నాక్స్, తేనీటిని అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్లాస్టిక్ని నిరోధించడం అనేది మాటలలో కాకుండా నూరు శాతం అమలకు కృషి చేయాలని సంకల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే పశ్చిమగోదావరి జిల్లాలో మోడల్ జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఒక్క అధికారి కంకణబద్ధులై కృషి చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణంరాజు జయంతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండే గుణం రెబల్ స్టార్ కృష్ణంరాజుకే సొంతమని, ఈ చేత్తో చేసిన దానం ఆ చేతికి తెలియకూడదు అనేది ఆయన సిద్ధాంతమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం భీమవరం డిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కేంద్ర మాజీ మంత్రి రెబల్ స్టార్ యువి.కృష్ణంరాజు జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ కోయ్యే మోషేన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్ఎలు పులపర్తి రామాంజనేయులు, పత్సమట్ల ధర్మరాజు, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, తెలంగాణ ఎంఎల్ఎ కెవి.రమణరెడ్డి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పలువురు ప్రముఖులు కేక్ కట్ చేసి మాట్లాడారు. కృష్ణంరాజు చేసిన పాత్రలే ఆయనకి రెబల్ స్టార్ అనే పేరు తీసుకొచ్చాయని, ఆ పేరుకు తగ్గట్టుగానే ఆయన ప్రయాణం సాహసోపేతంగా సాగిందని, భిన్నమైన పాత్రలతో నటుడిగా, పరిశ్రమ స్థాయిని పెంచే చిత్రాలతో నిర్మాతగా ఆయన ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎన్ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్ధసారధి, కోళ్ల నాగేశ్వరరావు, డాక్టర్ పిఆర్కె.వర్మ, అల్లూరి సాయి దుర్గారాజు, పేరిచర్ల సుభాష్, గోకరాజు పాండు రంగరాజు, జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఉండి వాసు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి : ఎంఎల్ఎ

తణుకు : ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా ఆసుపత్రి, తణుకు వైద్యులకు తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. సోమవారం తణుకు పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ఎంఎల్ఎ రాధాకృష్ణతో మాట్లాడుతూ నాలుగు నెలల వేతన బకాయిలు ఉన్నాయని, పిఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో సక్రమంగా జమ కావడం లేదని, ఆసుపత్రి స్థాయికి అనుగుణంగా కార్మికులను నియమించాలని తెలియజేశారు. సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేస్తాని తెలియజేస్తూ, సంబంధిత కాంట్రాక్టర్తో చరవాణిలో మాట్లాడారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ వెలగల అరుణ, డాక్టర్ కె.శారదాప్రసూన, నర్సింగ్ సూపరింటిండెంట్ జాన్లిల్లి పాల్గొన్నారు.

ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

నరసాపురం : మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులను సిబ్బంది, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎంపిపి ఎం.సోని అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్మికులకు వేతనాలు, నిబంధనల ప్రకారం పనులు జరిగాయా, లేదా అన్న విషయాలను తెలుసుకోవాలన్నారు. పంచాయితీరాజ్ ద్వారా చేపట్టిన పనుల్ని తనిఖీ చేయాలన్నారు. అనంతరం గ్రామాల్లో సభలు నిర్వహించి చేపట్టిన పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎంపిడిఒ రామకృష్ణంరాజు మాట్లాడుతూ జరిగిన పనులపై ఆడిట్ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీ చేస్తారన్నారు. అనంతరం ప్రజావేదిక సభలో జరిగిన పనులపై సమీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొక్కా రాధాకృష్ణ, ఎపిఒ వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పింఛన్లపై నిఘా

పాలకోడేరు : మండలంలోని అన్ని గ్రామాల్లో మంచం మీద ఉండి లేవలేని పరిస్థితితో ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులను బృందం సోమవారం ఆరా తీసింది. వారు నిజమైన అర్హులా, అడ్డదారిలో పింఛన్ తీసుకుంటున్నారా, వారి దగ్గర ఉన్న రిపోర్టులను పరిశీలించారు. మండలంలోని పాలకోడేరు, కుముదువల్లి, మొగళ్లు, వేంద్ర గ్రామాల్లో ప్రత్యేక వైద్య బృందం సభ్యులైన డాక్టర్ సుభాష్, డాక్టర్ ఆనంద్ స్వరూప్, పాలకోడేరు పిహెచ్సి వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రెడ్డయ్య వైద్య బృందం చేస్తున్న పరిశీలనను పర్యవేక్షించారు.

రహదారి పనుల పరిశీలన

తాడేపల్లిగూడెం: మండలంలోని నవాబ్పాలెం గ్రామం నుంచి జగన్నాథపురం గ్రామం వెల్లు రహదారిని అక్కడ జరుగుతున్న పనుల నాణ్యతను ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమల్లో భాగంగా గతంలో నిర్వహించిన పల్లెపోరు, ఎలక్షన్ క్యాంపెనింగ్ కార్యక్రమంలో అక్కడ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు మాసాలు గడవకముందే ఎన్ఆర్జిఎస్ నిధుల నుంచి రూ.61 లక్షలతో బీటీ రోడ్డును వేయించి మాటను నిలబెట్టుకున్నామన్నారు. ఆయన వెంట ఈతకోట తాతాజీ, అడపా ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్లు

నరసాపురం : పట్టణంలోని అంగన్ వాడీ కేంద్రాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. పట్టణంలో ఈనెల 21 నుంచి 24, 27 నుంచి 30 ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకూ వనువులమ్మ గుడి, కృష్ణబాబు కాలనీ, గంటాలమ్మ గుడి, పీచుపాలెం, ఎన్టిఆర్ కాలనీ, కొండాలమ్మ గుడి అంగన్వాడీ కేంద్రంలో క్యాంపులు నిర్వహిస్తున్నారు.అవసరమైనవారు తగు పత్రాలతో వచ్చి, ఈ సేవలు పొందాలన్నారు.

ఉండ్రమట్లకు ప్రైడ్ అవార్డు

ఆకివీడు : స్థానిక ఆదిత్య విద్యా సంస్థల అధినేత, ధ్యానరత్న డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు అంతర్జాతీయ ప్రైడ్ అవార్డు–2025కి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 12న అందేరివెస్ట్ ముంబాయిలోని రహేజా క్లాసిక్లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలీవుడ్ నటి ఈషా డియోల్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, ముఖ్య ప్రముఖులు అభినందనలు తెలిపారు.